క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు రూరల్ : నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో 25 కళాసంఘాల 2024 క్యాలెండర్‌ను విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారెడ్డిని కళాసంఘాల ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం నాయకులు, జిల్లా డాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

'జైహో సమ్మేళనం' పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్) : స్థానిక కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో 'జైహో 2వ జాతీయ సమ్మేళనం' పోస్టర్లను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైభారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దేశభక్తి కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అందులో భాగంగా జైహో జాతీయ సమ్మేళనం జిల్లాలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో జరుపుతోందన్నారు. జైభారత్ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ మాట్లాడుతూ హిందూ ముస్లింల ఐక్యత కోసం 15 రాష్ట్రాల జైభారత్ ప్రతినిధులతో ఈనెల 19న గాంధీ ఆశ్రమంలో నిర్వహిస్తున్న జాతీయ సమ్మేళనానికి ప్రజలందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం కమిటీ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా నేత అల్లాభక్షు, ఆశ్రమ కమిటీ సభ్యుడు రామిరెడ్డి, జైభారత్ జాతీయ కార్యవర్గ సభ్యులు కార్తికేయ, విజయకుమార్, జైభారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, శ్యామసుందర్, దళిత నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం అందజేత



నెల్లూరు రూరల్ : కొత్తూరు పరిధిలోని 30, 31 డివిజన్‌లో తుపాన్ బాధితులకు ప్రభుత్వ సాయాన్ని సోమవారం అందజేశారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.2,500 నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరమేశ్వరా.. పాహిమాం



విశేషాలంకరణలో శివయ్య



మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు





రాజరాజేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో..



ప్రత్యేక పూజలో ఆనం అరుణమ్మ, విజయకుమార్‌రెడ్డి

• ఆదిదంపతులకు ప్రణమిల్లిన భక్తజనం

నెల్లూరు(బృందావనం) : పవిత్ర కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆదిదంపతులైన శివపార్వతులకు పెద్దసంఖ్యలో భక్తులు ప్రణమిల్లారు. నగరంలోని వివిధ శైవక్షేత్రాల్లో కొలువైన పార్వతీ పరమేశ్వరులకు వేదపండితులు శాస్త్రోక్తంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రహోమాలు, క్షీరాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

• మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామికి ఉదయం పుష్పాభిషేకం, రాత్రి ప్రాకారోత్సవం, చిన్న రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. పుష్పాభిషేకం ఉభయకర్తలుగా పోలుబోయిన కోటమ్మ, రూప్‌కుమార్ యాదవ్, దయాకర్, స్రవంతి వ్యవహరించగా, ప్రాకారోత్సవం ఉభయకర్తలుగా ఊటుకూరు వెంకటేశ్వర్లు, లక్ష్మి, చిన్న రథోత్సవం ఉభయకర్తలుగా కోవూరు వెంకురెడ్డి, ధనమ్మ వ్యవహరించారు.

• నవాబుపేటలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో, మద్రాస్‌బస్టాండ్ సమీపంలో ఉన్న ఉమామహేశ్వర స్వామి, సంతపేట ములుముడి బస్టాండ్ సమీపంలో ఉన్న హరిహరనాథస్వామి, వేదాయపాళెంలోని మల్లికార్జునస్వామి, మూలాపేటలోని అన్నపూర్ణ నీలకంఠేశ్వరస్వామి, క్రాంతినగర్‌లో శివకేశవులు తదితర ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువైన స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

• నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో మహన్యాసం, శంఖాభిషేకం, అన్నాభిషేకం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

జెడ్పీ కార్యాలయంలో..

నెల్లూరు(పొగతోట) : నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం, పూజలు, వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రికార్డుల తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

నెల్లూరు సిటీ : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో టీహెచ్ వార్డు, పీహెచ్ వార్డులో రికార్డులను అడిషనల్ డైరెక్టర్ లెప్రసీ డాక్టర్ పద్మావతి సోమవారం తనిఖీ చేశారు. అనంతరం డామియల్ ఫౌండేషన్ అర్బన్ లెప్రసీ, టీబీ సెంటర్‌ను సందర్శించారు. శస్త్ర చికిత్స జరిగిన రోగులతో మాట్లాడారు. వారికి జరుగుతున్న వైద్యం, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోటమిట్టలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి అక్కడ వివిధ రకాల సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎస్ఎంఓ డాక్టర్ సురేంద్రబాబు, ఫిజియోథెరపిస్టు నరసింహులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నెల్లూరు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు జమీర్‌అహ్మద్ జన్మదినం సందర్భంగా వెంకటేశ్వరపురంలో దివ్యాంగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు



నెల్లూరురూరల్ : సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్ స్రవంతి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఏడో డివిజన్ అరుణాచలం వీధిలో..

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరురూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్ చింతారెడ్డిపాళెం సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో ఆమె పాల్గొని, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేశారు. స్థానికులకు జరిగిన లబ్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు కూడా వేగంగా జరుగుతుండడంతో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ చింతారెడ్డిపాళెంలోని ఎంపీయూపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ద్వారా నిధులు మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, పలువురు నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

7, 15 డివిజన్‌లలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏడో డివిజన్ అరుణాచలం వీధి సచివాలయంలో కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. అలాగే 15వ డివిజన్ మేఘనావీధి సచివాలయంలో కార్పొరేటర్ గణేశం సుజాత ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది.

బొంధిలి కులాన్ని ఓబీసీలో చేర్చాలి



నెల్లూరు(మినీబైపాస్) : బొంధిలి కులాన్ని ఓబీసీలో చేర్చాలని జిల్లా నేతలు ఎంపీ జీవీఎల్ నరసింహారావు కోరారు. ఈ మేరకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, ఏపీ బొంధిలి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణసింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌సింగ్, సెక్రటరీ శ్రీనివాస్‌సింగ్ ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి, వినతి పత్రం అందజేశారు. ఇందుకు జీవీఎల్ సానుకూలంగా స్పందించినట్లు జిల్లా నేతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజలు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామివారి మండల పూజోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా కోడూరు రవీంద్రరెడ్డి–ప్రసన్నలక్ష్మి, జనిత్‌కుమార్‌రెడ్డి– చంద్రకళ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను అయ్యప్ప సేవా సమాజం పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య, కె.మోహన్‌రావు, కేజీ శంకరన్, బి.మురళీ మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

అక్రమార్కులను వదిలిపెట్టం

• టీడీపీ నేత సోమిరెడ్డి

నెల్లూరు సిటీ : జిల్లాలో అక్రమ మైనింగ్ చేస్తున్న వారిని వదిలిపెట్టమని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. భారీ మైనింగ్ స్కాములకు అడ్డాగా ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉందన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నా లెక్క చేయకుండా పొదలకూరు మండలంలో క్వార్ట్జ్ మైనింగ్ చేస్తున్నారని తెలిపారు. దీనిని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆపలేకపోయారన్నారు. అక్రమ మైనింగ్‌పై అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు.

15న సింహపురి యునైటెడ్ క్యారల్స్



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న బిషప్

నెల్లూరు(బృందావనం) : ఏసుక్రీస్తు జనన సందేశాన్ని పాటల ద్వారా తెలిపే సింహపురి యునైటెడ్ క్యారల్స్‌ను ఈనెల 15న నిర్వహించనున్నామని బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం పేర్కొన్నారు. సంతపేటలోని బిషప్ హౌస్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరణ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బిషప్ ప్రకాశం మాట్లాడుతూ సుబేదార్‌పేటలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామన్నారు. సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఏబీఎం కాంపౌండ్ నుంచి ఆర్టీసీ, వేదాయపాళెం, గాంధీనగర్, డైకస్‌రోడ్డు మీదుగా బట్వాడిపాళెం సెంటర్ వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్లు రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ జాన్‌జో, పాస్టర్ రెవ కె.శ్యాంసన్‌కుమార్, పాస్టర్ హరిపాల్, ఫాదర్ థామస్, క్వైర్ డైరెక్టర్ బిల్లి శ్యాంసన్, సభ్యులు కె.విద్యాధర్, మహేష్, దినేష్, సాయి పాల్గొన్నారు.

వైభవంగా నగరోత్సవం



నగరోత్సవంలో శివభక్తులు

నెల్లూరు(బృందావనం) : 'ఓంనమః శివాయ' అంటూ శివ భక్తులు నెల్లూరులో సోమవారం చేపట్టిన నగరోత్సవం వైభవంగా సాగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం సన్నిధిలో గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యుడు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 600 మందికిపైగా భక్తులు శివదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో పెన్నమ్మకు పవిత్ర హారతి ఇచ్చి కార్తీక దీపాలు వదిలారు. అనంతరం ద్వాదశ జ్యోతిర్లింగాలను స్మరిస్తూ 12 కలశాలలో నదీజలాన్ని తీసుకుని నగరోత్సవాన్ని చేపట్టారు. రంగనాయకులపేట, నాలుగుకాళ్ల మండపం, ములుముడి బస్టాండ్ సెంటర్, చిన్నబజారు, పెద్దబజారు, అలంకార్‌సెంటర్, బ్రాహ్మణవీధుల మీదుగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం వరకు నగరోత్సవం హోరెత్తింది. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త కోట సునీల్‌కుమార్‌స్వామి, రాపూరు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, భక్త బృందం కన్వీనర్ కేవీఆర్ విజయకుమార్‌రెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం) : మాసశివరాత్రిని పురస్కరించుకుని బాలాజీనగర్‌లో ఉన్న సీతారామ స్వామి మందిరంలో శివపార్వతుల కల్యాణోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. తొలుత స్వామివారికి శాస్త్రోక్తంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు, పూజలు జరిపారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు, అప్పలస్వామి, టీవీ శేషగిరిరావు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై ముందస్తు జాగ్రత్తలు

• కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశం



కమిషనర్‌కు అర్జీ అందజేస్తున్న కార్పొరేటర్ అశోక్‌కుమార్

నెల్లూరు(బారకాసు) : రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో నగరపాలక సంస్థలో అన్ని విభాగాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. వర్షాలకు అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల్లో, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పారుదల కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి ప్రవాహానికి అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందనలో అందే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని తెలిపారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలని చెప్పారు.

స్పందనకు 35 ఫిర్యాదులు

స్పందనలో 35 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 18, హౌసింగ్‌కు 4, ప్రజారోగ్య విభాగానికి 6 చొప్పున ఉన్నాయని వెల్లడించారు. ఫిర్యాదుల్ని గడువులోపు పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్ఓ వెంకటరమణ, మేనేజర్ ఇనయతుల్లా పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు విజ్ఞప్తి

18వ డివిజన్ రాజీవ్‌గాంధీ కాలనీ ప్రాంతంలో రోడ్డు నిర్మించాలని ఆ డివిజన్ కార్పొరేటర్ అశోక్‌కుమార్ కోరారు. ఈమేరకు కమిషనర్ వికాస్‌మర్మత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ కాలనీలో రోడ్డు అధ్వానంగా ఉందని, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి డివిజన్ పర్యటనకు వచ్చిన సందర్భంగా రోడ్డు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. కమిషనర్‌తో మాట్లాడి రోడ్డు ఏర్పాటు చేయిస్తామని ఎంపీ హామీ ఇచ్చారని, ఆయన సూచన మేరకు వినతిపత్రం ఇచ్చామన్నారు. రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అర్జీ సమర్పిస్తున్న డివిజన్ ఇన్‌చార్జి, స్థానికులు

నగరంలోని 20వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి, ఇరుకళల పరమేశ్వరి ఆలయ చైర్మన్ రావు శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు కమిషనర్ వికాస్‌మర్మత్‌ను వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో సిబ్బంది కొరత వల్ల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు. శానిటేషన్ సమస్యలను పరిష్కరించాలని, పబ్లిక్ పార్కులు ఆక్రమణకు గురికాకుండా కాంపౌండ్ వాల్స్ నిర్మించాలని, శ్మశానవాటికలకు ప్రహరీ ఏర్పాటు, ఇస్కాన్‌సిటీలో రోడ్డు క్లియర్ చేయడం, చెత్తను తీసుకెళ్లేందుకు వాహనాన్ని ఏర్పాటు చేయడం తదితర సమస్యలపై అర్జీ సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నేతలు దువ్వూరు భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రమేష్ రెడ్డి, రంగయ్య, రవీంద్రరెడ్డితో పాటు ఇస్కాన్ సిటీ, స్నేహానగర్ వాసులు పాల్గొన్నారు.

ఆక్రమణ నుంచి కాపాడాలి

మినీబైపాస్ రోడ్డులో సప్తగిరికాలనీ లేఅవుట్‌లోని పార్కు స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు అధికారులు స్పందించి పార్కు స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించి అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. పార్టీ నేతలు సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, రాజేష్, శ్రీనివాసులు, రాజేశ్వరి పాల్గొన్నారు.

సమస్యలపై దశలవారీ పోరాటం

నెల్లూరు (టౌన్) : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాన్ని చేయనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ తెలిపారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం, మెడికల్ రీయింబర్స్‌మెంట్, కొత్త డీడీఓలకు పవర్స్ కల్పించాలని, ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అచ్చయ్య, నాయకులు నరసింహులు, రవికాంత్, సనావుల్లా పాల్గొన్నారు.

న్యాయం చేయండి



మాట్లాడుతున్న బాధితురాలు

నెల్లూరు(మినీబైపాస్) : కుమార్తె వివాహం కోసం దాచుకున్న నగదును కొందరికి అప్పుగా ఇస్తే తిరిగి చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు న్యాయం చేయాలని షేక్ ఫర్హిన్ సుల్తానా వాపోయారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అఫ్జల్, ఇలియాజ్, సలీమ్, రహంతుల్లా అనే వ్యక్తులకు రూ.14.50 లక్షలను అప్పుగా ఇచ్చానని, దీనికి సంబంధించి ప్రామిసరీ చెక్కును తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆ చెక్కును బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తే బౌన్స్ అయినట్లు వెల్లడించారు. వారి నుంచి నగదు ఇప్పించాలని ఆమె వేడుకున్నారు.